


– 'శమైతాంగి'

ఆకాశం నిర్మలంగా మంచి నాని ముసులా ఉన్నది. ఆకాశంలో చందమామ అందమైన యువతి తలలోని ముద్దబంతి పూవులా నిండుగా కాంతిని వెదజల్లుతూ ఆకాశం నుంచి భూమికి వెన్నెలవానను కురిపిస్తున్నది, చల్లగా, ఆహ్లాదకరంగా.

అద్దంలా మెరుస్తున్నది ఏటిలోని నీరు. ఆ నీటిలో తన ప్రతిబింబాన్ని చూసుకుంటూ మురుస్తున్నాడు చుక్కల రేడు. పిండి ఆరబోసుకున్నట్లున్న వెన్నెలలో అడుగులు లెక్కిస్తూ వచ్చింది సరస్వతి.


ఆమె కాళ్ళ సవ్వడికి బెదిరిన ఓ బురద గొడ్డు 'అమ్మో, మనిషి' అన్నట్లు భయంగా చూసి నీటిలోకి జారిపోయింది వేగంగా.

నీ కెంత భయమేం వచ్చింది? ఆడపిల్లే కదా అనే నిర్లక్ష్యంతో నవ్వినట్లు ఏటిలో నీళ్ళు గలగలమంటూ కెరటాలను ఎగబోశాయి.

ఏటివార సోమరివాడిలా పెరుగుతున్న రెల్లుగడ్డి 'అవును. పాములు పుట్టే పిరికి జాతివి' అన్నట్లు అటూ ఇటూ తల లూపుతూ ఒయ్యారంగా కదిలాయి. గట్టు మీదనుంచి తేలుతూ వచ్చిన గాలి సరస్వతి అందమైన శరీరాన్ని మృదువుగా రాసి పక్కకి పరుగులెత్తింది.

'అబ్బ! ఎంత చల్లగా ప్రాణానికి హాయిగా ఉం దిక్కడ!' సరస్వతి చేతిలో బిందెను కింద పెట్టి చుట్టూ కలియ చూసిందో సారి.

ఎవరో వస్తున్నారు, లుపుం లుపుంగా ఊపుకుంటూ.



స్తబ్ధప్రకృతి

ఫొటో— ఐ. ఉమ ( తెనాలి )

అదీ ఓ అదృష్టమేలే. ఆ ప్రేమించడం కులం వాడినే ప్రేమించింది. లేకపోతే ఆ కూతురి పెళ్ళి చేయలేక ముందు ఆ సుభద్రమ్మ ప్రాణాలు తీసుకునేది... కాలేజీల్లో చదివే అబ్బాయిలు, అమ్మాయిలు ఒకర్నొకరు ప్రేమించుకుని వీలైతే పబ్లిగ్గా, వీలుకాకపోతే చాటుగా పెళ్ళి చేసుకుంటారట కదూ? అలా అని మా మరిది చెప్పాడులే.''

'మీ మరిది ఇంకేం చెప్పాడు? మీ మరిదికి చదువుకోవడం కాక ఇటువంటి విషయాలు సేకరించి ప్రచారం చేయడమేనా పని' అనా లనుకున్నది సరస్వతి. ఆ మాటకి తులసి పెడర్థాలు తీస్తుందేమో అనే భయంతో ఆ మాటని మనసులోనే దాచుకుంది. తులసి కాలేజీ వాళ్ళ ప్రేమల గురించి, పెళ్ళిళ్ళ గురించి ఇంకా ఏవో చెపుతూనే ఉంది కాని, సరస్వతి ఆమె మాటల్ని వినడం లేదు. తన గురించి ఆలోచించుకుంటున్నది.

'రేపు తనగురించీ ఇలాగే చెప్పుకుంటారు'—చదువు పేరుతో పట్నంలో మకాంపెట్టి ఎవర్నో ప్రేమించిందిట. వాడు మోసం చేశాడు అని. అప్పుడు... అప్పుడు మా కుటుంబం అందరి నోట్లోనూ నానుతుంది. హేళనకు గురి అవుతుంది. ఇంటి పరువు బజారులోకి ఎక్కుతుంది. అవమానభారంతో తల్లీ, తండ్రీ తలఎత్తుకు తిరగలేరు. తన కుటుంబం ఎంత ఉన్నతమైనదైనా తన కారణంగా మలినపూరిత మవుతుంది. మచ్చ వస్తుంది. కాని, ఇదంతా నేను తెలిసి, కావాలని చేసిన పాపం కాదు. కాని, తప్పు ఎవరిదైతేనేం? ఫలితం నేనూ, నా ద్వారా నా కుటుంబమూ అనుభవిస్తాము.

''ఇలా జరగడానికి కారణం నీవు కాదూ?'' మనసు హుంకరించింది.

నేను కాదు. . . నేను కాదు. . . అసలు ఇలాంటి దేదో జరుగుతుందని ముందే తెలిస్తే. . .?

'' ఊఁ తెలిస్తే. . .?''

ఆ సుందరమూర్తితో పరిచయం చేసుకునేదానినేకాదు. అసలు ఆ పరిచయమైనా తను కావాలని చేసుకోలేదు. తనంతట తనే వచ్చి పరిచయం చేసుకున్నాడు. కాలేజీ ఏనివర్సరీకి తను లలితసంగీత పోటీల్లో పాల్గొంది. తనకే ప్రైజు వచ్చిందికూడా. ఆ సంతోషంలో తను మునిగి ఉండగా ''మీరు చాలా బాగా పాడతారు. మీ రింత బాగా పాడగలరని నేను కలలోకూడా అనుకోలేదు'' అని తనని, తన పాటని తెగ మెచ్చుకునే అతన్ని చూసి తను కంగారు పడింది. తను సాధారణంగా ఎవరితోనూ అంత పరిచయంగా మాట్లాడదు. తనకు స్నేహితురాండ్రుకూడా చాలా తక్కువేను. తను మూగదని, ఎవరితోనూ స్నేహంగా ఉండదని చెప్పుకుంటారు కూడా. అటువంటి తనని ఒక యువకుడు పనిమాలా వచ్చి ప్రశంసిస్తుంటే తనకు నిజంగానే మతి పోయినట్లయింది. జవాబు చెప్పడానికి సిగ్గు పడింది.

తన పాటని చాలా మంది మెచ్చుకుంటారు— ఆ సంగతి తనకూ తెలుసు. కాని, ఓ యువకుడు అంతలా మెచ్చుకుని భట్టాజుకి పెద్ద తమ్ముడిలా పొగిడేస్తుంటే ఏమని జవాబిస్తుంది? ''నా పాట మిమ్మల్ని అంతగా ఆకర్షించినందుకు సంతోషమండీ.'' ఆ కాస్త మాట చెప్పడానికే ముచ్చెమట్లు పోశాయి. ఆ తరవాత అతను తను కనిపించినప్పుడల్లా నవ్వుతూ విష్ చేసేవాడు. ఒక్కోసారి తాపీగా నిలుచుని తన స్వవిషయాల గురించి కూపీ తీయడానికి ప్రయత్నించేవాడు. మొదటినుంచీకూడా ఎందుకనో అతని తోటి పరిచయం తనకు అంత ఇష్టంగా ఉండేది కాదు. ముక్కూ మొహం తెలియని పరాయి వ్యక్తితో మాటలేమిటి అనేనిర్లక్ష్యంతో, చిరాకుతో తప్పించుకోవడానికే చూసేది. కాని, దురదృష్టం, తను ఎంత దూరంగా ఉండాలని అనుకునేదో అత సంత చనువుగా మాట్లాడేవాడు.

ఒక్కోసారి తను ఉంటున్న రూముకి కూడా వచ్చి ఏదో హస్కు వేయడానికి ప్రయత్నించేవాడు. అతని రాకపోకలు దేనికి దారి తీస్తాయో అని లోలోపల భయశంకితురాలయ్యేది.

ఆ రోజు తనూ, తన క్లాస్‌మేట్సూ కలిసి సినిమాకు వెళ్ళారు. మధ్యలో కరెంట్ పోయింది. గంట గంటన్నర వరకూ రాలేదు. ఇక వెళ్ళిపోదామనుకుంటూ ఉండగా వచ్చింది తిరిగి. ఆట ముగిసేసరికి చాలా ఆలస్యమయింది. ఇంటి కెళ్ళి అన్నం తినకుండానే పడుకుంది. అప్పుడే తనని దురదృష్టం పట్టుకుంది. మంచి నిద్ర, ఆ నిద్రలో కల. సినిమాలోని హీరో వచ్చి తనతో కబుర్లు మొదలు పెట్టాడు. ఎవరికీ లభించని ఆ అదృష్టానికి తను ఎంతో పొంగిపోతున్నది. ఉన్నట్టుండి అతను తన చేయి పట్టుకున్నాడు. ''ఛీ. పాడు! ఇదేమిటి? చెయ్యి వదలండి ముందు.'' తను చెయ్యి విదిలించుకుంటూ అతని వైపు చూసి తుళ్ళిపడింది. ఆ సినిమా హీరో అచ్చు సుందరమూర్తి లాగానే ఉన్నాడు. ''ఊఁ మీరా?'' తను తెల్లబోయింది.

''ఊఁ నేనే. ఎవరనుకున్నావు?'' అతను చెయ్యి వదిలినట్లే వదిలి చటుక్కున తనని కౌగిలించుకున్నాడు. ఆ కౌగిలిలో తనకు ఊపిరి సలపడం లేదు. ఉక్కిరి బిక్కిరవుతూ పెనుగు లాడింది. ఆ పెనుగులాటలో తనకు పూర్తి మెలకువ వచ్చేసింది. నిజంగానే తన నెవరో కౌగలించుకుని ఊపిరి సలప నివ్వడం లేదని అప్పటిగ్గాని గ్రహించలేదు.

''ఎవరు . . . నన్ను వదిలి పెట్టండి ప్లీజ్. . .'' తన గొంతు దు:ఖంతో వణికిపోతున్నది. కోపం, నిస్సహాయత. అర్ధరాత్రి, గదిలో ఒంటరిగా, సహాయం కోసం ఎక్కడకు వెళ్ళగలదు? తన శరీరంలోని శక్తినంతా వినియోగించి అతన్ని ప్రతిఘటించడానికే ప్రయత్నించింది.

''ఉష్. అరవకు. నేను. . .'' ఆ గొంతు తెలిసిన గొంతులాగానే ఉంది. అది సుందరమూర్తి గొంతుకే.

ఎంత దుర్మార్గుడూ! కావాలని స్నేహం నటించి, ఇంత నైచ్యానికి పాలుబడుతున్నాడా!

''మీకు దణ్ణం పెడతా. నన్ను విడిచి పెట్టండి. నేను చదువుకోవడానికి వచ్చాను. నన్ను మలినపరచవద్దు. నా బ్రతుకులో మచ్చ తీసుకురావద్దు. వెళ్ళిపొండి. . . వెళ్ళిపొండి. . . ప్లీజ్, మిమ్మల్ని వేడుకుంటున్నా.'' తనలో శక్తి ఉన్నంతవరకూ అతన్ని బ్రతిమాలుతూనే ఉంది. అతనితో పెనుగులాడి పెనుగులాడి తనలోని శక్తిఅంతా హరించి పోయింది. ఇక పోరాడలేదు... ఆడదానికి ఏది పవిత్రమైనదో అదే పోగొట్టుకుంది. తను ఓడిపోయింది. ఇంకెందుకు తన బ్రతుకు? రేపు ప్రజల మొహం ఎలా చూడగలదు? అమ్మా నాన్నా, తోబుట్టువులూ—వాళ్ళందర్నీ ఎలా చూస్తుంది? ఈ అవమానం నా ఒక్క దానితోనే పోదు. మనసు దుఃఖంతో, ద్వేషంతో ఘోషిస్తున్నది. తన ఘోష వినే దెవరు? భగవంతుడంటూ ఉంటే ఇంత అన్యాయం ఎందుకు జరిగింది? ●



అన్యాయం నాకేనా, నాలాంటి అమ్మాయిలకేనా? అప్పుడే తన ప్రాణాలను తుదముట్టించుకోవాలనుకుంది. కాని, అకస్మాత్తుగా పోయినా తన గురించి మంచిగా ఎవరూ చెప్పుకోరు. జరిగిన అవమానం ఎలాగూ జరిగిపోయింది, అతని కాళ్ళమీదే పడతాను నా కో మార్గం చూపెట్టమని. ఆ నిశ్చయాని. కొచ్చి అతని చుట్టూ పిచ్చికుక్కలా తిరిగింది.

ఆడవారి జీవితాలతో చెలగాట మాడే మగవాడు అంత తేలిగ్గా దారి కొస్తాడా? "చూద్దాం! ఈ డిగ్రీ పూర్తి కానీ, తప్పకుండా నిన్నే పెళ్ళి చేసుకుంటాను." కడుపులో మాలిన్యాన్ని పైకి కనబరచకుండా తీపి తీపి మాటలను చెప్పే సుందరమూర్తి మాటలన్నీ నిజమని నమ్మింది. దుర్మార్గుడు. తనతో తీపికబుర్లు చెపుతూనే మరొకరి మెళ్ళో ఉరితాడు వేసే సన్నాహం చేసుకున్నాడు. చివరకు డబ్బుకే విజయం లభిస్తుంది. ఎప్పుడూను. చదువుకున్న నేనూ, చదువు లేని కాంతం—ఇద్దరమూ ఒకే బాటలో నిలబడ్డామిప్పుడు. ఈ పాపానికి నిష్కృతి లేదా? లేదా?' పిచ్చిదానిలా ఆలోచిస్తూ ఏటివారకు దిగింది సరస్వతి.

'అటెళ్ళకు. అక్కడ ఊబిగా ఉంటుంది. ఇటు. . . ఇటు దిగు." సరస్వతిని హెచ్చరిస్తూ తను నీళ్ళు నింపుకుంది తులసి. ఆ మాటలు విన్న సరస్వతికి మెరుపులా ఓ ఆలోచన తట్టింది. 'అలాగే చేస్తాను. నా రహస్యం నాతోనే అంతమై పోవాలి.'

తులసి బిందెతో గట్టు ఎక్కుతూ అప్రయత్నంగానే వెనక్కి తిరిగి చూసి కెవ్వున అరిచింది. "అయ్యో, సరసూ. . . సరసూ, అక్కడ ఊబిగా ఉంటుంది అని చెప్పాను కదా!" లబలబలాడుతూ కిందికి వచ్చింది. కాని, అప్పటికే సరస్వతి మునిగిపోవడం జరిగిపోయింది. ఆమె తెచ్చిన బిందె మాత్రం నీటిమీదనే తేలుతూ కెరటాల తాకిడికి ఏటిమధ్యకు కొట్టుకుపోయింది. ఒక నిండు ప్రాణాన్ని పొట్టన బెట్టుకున్న ఏరు మాత్రం ఏమీ ఎరగనిదానిలా నిశ్శబ్దంగా ప్రవహించ సాగింది.

తులసి నీళ్ళను అక్కడే దిమ్మరించి ఖాళీబిందెతో ఊళ్ళోకి పరుగెత్తింది, ఈ విషాద వార్తను నలుగురికీ చెప్పడానికి. ఈత వచ్చిన వాళ్ళంతా ఏటిలో దిగి గాలించారు. కొన్ని గంటలకు ప్రాణం లేని సరస్వతిని తీసి గట్టుమీద పడుకోబెట్టారు.

అందమైన సరస్వతి శరీరం నీళ్ళలో నాని ఉబ్బి వికారంగా ఉంది. కొన్ని గంటల క్రితం వరకూ ప్రాణంతో ఉండి చలాకీగా గెంతిన ఆ ఆకారం ఇప్పుడు కట్టెలా బిగుసుకుని పడి ఉంది.

"ముద్దబంతి పూవులాంటి పిల్ల, చదువుల సరస్వతి. అప్పుడే నీకు నూరేళ్ళూ నిండిపోయాయా, తల్లీ!" చూడవచ్చిన వారంతా విలపించారు.

కాని, వాళ్ళకు సరస్వతి ఎందుకు చనిపోయిందో తెలియదు. వాళ్ళకు తెలిసింది, కనిపించేది అందమైన అమ్మాయి, బుద్ధిమంతురాలు కాలు జారి ఏటికి బలైపోయిందని మాత్రమే.

కాని, సరస్వతి బుద్ధిపూర్వకంగానే ఆ పని చేసిందని అందుకు కారకుడైన ప్రబుద్ధుడు టౌనులో సంతోషంగా కులుకుతూ మరో అమ్మాయి మెడలో పసుపుతాడు బిగించడానికి సిద్ధంగా ఉన్నాడని వాళ్ళ కెవరికీ తెలియదు. ఒకవేళ తెలిస్తే పెళ్ళి కాకుండానే తల్లి కాబోయే సరస్వతిని ఎవరూ క్షమించలేరేమో? ఆమె మరణానికి కారకుడైన ఆ ప్రబుద్ధుడిని మాత్రం క్షమించేస్తుంది. 'మగవాడు—వాడికేం, అనే మాటతో ఒకరికి ఒక న్యాయం, మరొకరికి ఇంకో న్యాయం—ఇదీ లోకపు తీరు.

ఆకాశం నుంచి ఒక చుక్క రాలింది కిందకు. ఆకాశం నిండా మిలమిల్లాడే నక్షత్రాలు లెక్కలేనన్ని. అన్ని నక్షత్రాలలో ఓ నక్షత్రం రాలితే మాత్రం ఆకాశానికి లోటేమిటి?

ఇంత ప్రపంచంలో మోసపోయిన అబల మరణం ఎంతమందిని కదిలిస్తుంది ఎన్ని వివాదాలు లేవదీస్తుంది? సరస్వతి లాంటి అబలలు, అమాయకులు పుట్టుతూనే ఉంటారు. సుందరమూర్తి లాంటి అబ్బాయిల చేతుల్లో పడి బలై పోతుంటారు. వీళ్ళకు నిష్కృతి ఎప్పటికో? అసలు నిష్కృతంటూ ఉంటుందా ఈ ఆడపిల్లలకు?' అని ప్రకృతి శోక హృదయంతో విలపిస్తున్నదా అన్నట్లు ఎక్కడో ఫెళఫెళమంది, ఆకాశం. క్షణంలో మేఘావృతమై పోయింది.

దగాపడిన సోదరిని చూసి ఎవరు మాత్రం బాధపడరు? *

బతుకుకోసం

చిత్రం— బి. ఎల్. ఆంజనేయులు

(గుంతకల్ – 2)